RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:69 | ఫిబ్రవరి 20, 2026 | వెల: రూ.3-00



## కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్


### ఐదుగురు మావోయిస్టులు మృతి

ఆపరేషన్ 'కగార్'లో భాగంగా కేంద్ర, రాష్ట్ర బలగాల సంయుక్త కూంబింగ్

వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలు సంయుక్తంగా విస్తృత స్థాయిలో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టు కీలక నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో దేశంలో మావోయిస్టు కార్యక లాపాలను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆపరేషన్ కగార్‌ను మరింత వేగవంతం చేసినట్లు సమాచారం. దాదాపు 5 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, రాష్ట్ర భద్రతా బలగాలు కలిసి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో భారీ ఎత్తున కూంబింగ్ చేపడుతున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# పోస్టుమార్టం పాలిటిక్స్!



## పార్టీల్లో మొదలైన అంతర్మథనం

- ఎన్నికల గ్రాఫ్ హెచ్చుతగ్గులపై విశ్లేషణ
- 'హస్తం' గెలిచినా టఫ్ ఫైట్ ఇచ్చిన 'కారు'
- బీజేపీ పుంజుకోవడంతో గులాబీపార్టీలో కంగారు
- మూడు పార్టీల్లో మొదలైన ఇంటర్నల్ రివ్యూ
- బీజేపీ, బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయనున్న కాంగ్రెస్
- తిరిగి పుంజుకునేందుకు కారు పార్టీ కసరత్తు
- తెలంగాణపై ఢిల్లీ కమలనాథుల నజర్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు

2లో

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

తెలంగాణలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కోలాహలం ముగియడంతో, ఇప్పుడు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ అంతర్గత పోస్టుమార్టం ప్రక్రియను ముమ్మరం చేశాయి. ఈ ఎన్నికల ఫలితాల సరళిని బట్టి ఏ పార్టీ ఎక్కడ బలంగా ఉంది? ఏ ఏ నియోజక వర్గాల్లో పట్టు కోల్పోయింది? అనే అంశాలపై పార్టీ పెద్దల సమక్షంలో సుదీర్ఘ కసరత్తు జరుగుతోంది. కేవలం స్థానిక పీఠాలను దక్కించుకోవడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇవే పునాదులుగా భావిస్తూ.. క్షేత్రస్థాయిలో 'మిషన్ 2028' కోసం ఇప్పుడే గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసే పనిలో పడ్డాయి. అధికార కాంగ్రెస్ తన విజయ పరంపరను కొనసాగిస్తూ బీఆర్ఎస్‌ను పూర్తిగా అణచివేసేలా పావులు కదుపుతుండగా.. పట్టు కోల్పోయిన గులాబీ దళం తిరిగి పుంజుకునేందుకు సరికొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. మరోవైపు ఉత్తర తెలంగాణలో సత్తా చాటిన బీజేపీ, ఢిల్లీ పెద్దల అండతో రాబోయే ఎన్నికల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదిగేందుకు వ్యూహరచన చేస్తోంది. ముున్ముందు మరెన్నో రాజకీయ మలుపులకు వేదిక కాబోతున్న రాష్ట్ర రాజకీయాలపై ప్రత్యేక కథనం..

## కాంగ్రెస్‌లో పదవుల పందేరం

- మార్చి 15లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్




2లో

## షార్ట్ సర్క్యూట్‌తో పేలిన రిఫ్రిజిరేటర్

తంగళ్లపల్లిలో తప్పిన పెను ప్రమాదం



2లో



## తెలంగాణ ఎవరి జాగీరు కాదు

- ఉద్యమంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది
- జాతిపిత దేశానికి మహాత్మాగాంధీ మాత్రమే..
- కేసీఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

2లో



## ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించాలి

### హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి

- మహిళలు, రైతులు, యువతకు తగిన నిధులు ఇవ్వాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయింపులు చేయాలి
- హామీలు అమలు చేయకపోతే ప్రజల తరపున నిలదీస్తాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగలేఖ

2లో

## ఢిల్లీలో సీఎం, మంత్రివర్గం!

### ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ



- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌పై విస్తృత చర్చ
- రాష్ట్ర అభివృద్ధి రోడ్‌మ్యాప్‌పై సమగ్ర వివరణ
- ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక వాగ్దానాల అమలుపై వివరాలు
- మహిళలు, రైతులు, యువత సాధికారత చర్యలపై నివేదిక
- జాతీయ నాయకత్వ మార్గదర్శకత్వంతో అభివృద్ధి వేగవంతం లక్ష్యం

2లో



## నా ఫస్ట్ చాయిస్.. సిద్దిపేట

- మే తొలి వారంలో కొత్త పార్టీ
- కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

వేద న్యూస్, హైదరాబాద్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మే తొలి వారంలో కొత్త రాజకీయ పార్టీని స్థాపించను న్నట్లు ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాను ఎన్నికల్లో సిద్దిపేటను ఫస్ట్ ఛాయిస్‌గా, బోధన్‌ను సెకండ్ ఛాయిస్‌గా తీసుకుని పోటీ చేయనున్నట్లు వెల్లడిం చారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ

మిగతా 2వ పేజీలో..

వేద న్యూస్

శుక్రవారం | ఫిబ్రవరి 20, 2026

## నా ఫస్ట్ చాయిస్.. సిద్దిపేట

### మే తొలి వారంలో కొత్త పార్టీ

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటుపై కీలక ప్రకటన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని విమర్శించారు. ప్రజల ఆశలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాను స్థాపించబోయే పార్టీ వ్యక్తుల ఆధారంగా కాకుండా వ్యవస్థల ఆధారంగా నడుస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ వాదమే తమ పార్టీ ప్రధాన సిద్ధాంతమని తెలిపారు. కొత్త తరానికి రాజకీయాల్లో అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా తమ పార్టీ పోటీ చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో ప్రధాన ప్రతిపక్షంగా తమ పార్టీ ఎదుగుతుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయబడిన అనంతరం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత, ప్రస్తుతం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ కొత్త పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తెలంగాణ ఎవరి జాగీరు కాదు

### ఉద్యమంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది

- జాతిపిత దేశానికి మహాత్మాగాంధీ మాత్రమే
- కేసీఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుని ఇంకా ఎన్ని రోజులు రాజకీయం చేస్తారని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావుపై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి జాతిపిత ఒకరేనని, అది మహాత్మాగాంధీ మాత్రమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని, తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు. జాతిపిత అని చెప్పుకోవడం సరికాదని, ప్రజల్లోకి వచ్చి సమస్యలపై స్పందించాలని సూచించారు. తన పాలనలో అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారని విమర్శించారు. ప్రజలు అధికారంలో నుంచి దింపినప్పటికీ ఇంకా అహంకారం తగ్గలేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకున్నారని, ఇకపై సెంటిమెంట్ రాజకీయాలు పనిచేయవని కడియం శ్రీహరి పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో పదవుల పందేరం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీని మార్చి 15వ తేదీలోపు పూర్తి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. కాంగ్రెస్ హైకమాండ్‌తో జరిగిన సమావేశాల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ బలోపేతంతోపాటు రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణ, ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష జరిగినట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర నాయకత్వాన్ని అభినందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు విశ్వాసం ఉంచినందువల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విధి విధానాలపై కూడా రాహుల్ గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో కూడా విజయం సాధించి అధికారాన్ని కొనసాగిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. బడ్జెట్‌కు ముందు జరుగుతున్న ఈ ఢిల్లీ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది

## షార్ట్ సర్క్యూట్‌తో పేలిన రిఫ్రిజిరేటర్

### తంగళ్లపల్లిలో తప్పిన పెను ప్రమాదం

**వేద న్యూస్, తంగళ్ళపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా రిఫ్రిజిరేటర్ పేలిపోవడంతో సుమారు రూ.90 వేల నగదు అగ్నికి ఆహుతైంది. ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితుడు బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం, ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడం ప్రారంభమైంది. అప్రమత్తమయ్యేలోపే పెద్ద శబ్దంతో ఫ్రిజ్ పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వారు వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే రిఫ్రిజిరేటర్ సమీపంలో భద్రపరచిన సుమారు రూ.90 వేల నగదు మంటల్లో పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# పోస్టుమార్టం పాలిటిక్స్!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

రాష్ట్రంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల కోలాహలం ముగియడంతో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పోస్టమార్టం మొదలైంది. ఫలితాల సరళిని బట్టి ఏ పార్టీ ఎక్కడ బలంగా ఉంది? ఎక్కడ పట్టు కోల్పోయింది? అనే అంశాలపై ఆయా పార్టీల అధిష్టానాలు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నాయి. కేవలం స్థానిక సంస్థల పీఠాలను దక్కించుకోవడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇవే పునాదులుగా భావిస్తూ, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో గ్రౌండ్ వర్క్ ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలోని గాంధీ భవన్, తెలంగాణ భవన్, బీజేపీ కార్యాలయాలు రాజకీయ మేధోమథనానికి వేదికలుగా మారాయి.

### పార్టీల్లో మొదలైన అంతర్మథనం

- ఎన్నికల గ్రాఫ్ హెచ్చుతగ్గులపై విశ్లేషణ
- 'హస్తం' గెలిచినా టఫ్ ఫైట్ ఇచ్చిన 'కారు'
- బీజేపీ పుంజుకోవడంతో గులాబీపార్టీలో కంగారు
- మూడు పార్టీల్లో మొదలైన ఇంటర్నల్ రివ్యూ
- బీజేపీ, బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయనున్న కాంగ్రెస్
- తిరిగి పుంజుకునేందుకు కారు పార్టీ కసరత్తు
- తెలంగాణపై ఢిల్లీ కమలనాథుల నజర్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు



### బీఆర్ఎస్ అణచివేత లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహాలు

అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ తన విజయ పరంపరను కొనసాగించడమే కాకుండా, మెజారిటీ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. అయితే, కాంగ్రెస్ కేవలం గెలుపుతో సంతృప్తి పడటం లేదు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను పూర్తిగా అణచివేయడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. బీఆర్ఎస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ కేడర్‌ను తమ వైపు తిప్పుకోవడం, అభివృద్ధి మంత్రంతో ఓటర్లను ఆకట్టుకోవడం వంటి చర్యలను వేగవంతం చేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా ఎదగాలని హస్తం పార్టీ నేతలు కృతనిశ్చయంతో ఉన్నారు.

### తిరిగి పుంజుకునేందుకు 'కారు' కసరత్తు

మరోవైపు, గత దశాబ్ద కాలం పాటు తెలంగాణను ఏలిన బీఆర్ఎస్ పార్టీ, ప్రస్తుత ఫలితాల నేపథ్యంలో ఆత్మరక్షణలో పడింది. అయితే, గులాబీ నేతలు మాత్రం ఈ ఫలితాలను తేలికగా తీసుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తున్న ప్రజా సమస్యలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ ముందంజలో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైతే పార్టీ ఓటమి పాలైందో, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాత్మక లోపాలను గుర్తించే పనిలో కేటీఆర్, హరీష్ రావు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తిరిగి ఫామ్‌లోకి రావాలని కారు పార్టీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా యువత, గ్రామీణ ఓటర్లను తిరిగి తమ దరి చేర్చుకోవడానికి పార్టీ సరికొత్త కార్యాచరణను రూపొందిస్తోంది.

### తెలంగాణపై ఢిల్లీ పెద్దల కన్ను

ఈ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకున్న పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ అని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు భైంసా మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో బీజేపీ తన ఓటు బ్యాంకును భారీగా పెంచుకుంది. ఈ ఫలితాలు చూసిన ఢిల్లీ పెద్దలు సైతం తెలంగాణపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఢిల్లీ నుంచి అగ్రనేతలు తెలంగాణలో పర్యటించి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉన్న పోరును తమకు అనుకూలంగా మార్చుకుని, వచ్చే ఎన్నికల్లో పీఠాన్ని దక్కించుకోవడమే కమలనాథుల అంతిమ లక్ష్యం.

### ఎక్కడ పొరపాటు జరిగింది

ప్రస్తుతం మూడు పార్టీలు కూడా జిల్లాల వారిగా రిపోర్టులను సేకరిస్తున్నాయి. సొంత పార్టీ నేతల మధ్య ఉన్న విభేదాల వల్ల ఎక్కడ ఓట్లు చీలిపోయాయి? అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు జరిగాయా? ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను ఎదుర్కోవడంలో ఎందుకు విఫలమయ్యాం? వంటి అంశాలపై లోతైన విచారణ జరుగుతోంది. కొన్ని చోట్ల పార్టీ ఫిరాయింపులు కూడా గెలుపోటములను ప్రభావితం చేయడంతో, ఇకపై నమ్మకమైన కేడర్‌ను తయారు చేయడంపై పార్టీలు దృష్టి సారించాయి. ఎక్కడైతే బలహీనంగా ఉన్నారో, అక్కడ బలమైన నేతలను ఇన్చార్జీలుగా నియమించి, ఇప్పటి నుంచే అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా మిషన్ 2028 ని మొదలుపెట్టాయి.

### ముందుందు మరెన్నో మలుపులు!

ప్రస్తుతానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉన్నప్పటికీ, బీజేపీ మూడో శక్తిగా ఎదిగి సమీకరణాలను మార్చేస్తోందని రాజకీయ నిపుణుల అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంత ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు త్రిముఖ పోటీగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రతి ఓటు, ప్రతి కార్యకర్త ఇప్పుడు పార్టీలకు అత్యంత కీలకంగా మారారు. పార్టీల పోస్టుమార్టం నివేదికలు బయటకు వచ్చాక, రాష్ట్ర రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు, కొత్త పొత్తులు లేదా పార్టీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## ఢిల్లీలో సీఎం, మంత్రివర్గం!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

### ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ

- 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌పై విస్తృత చర్చ
- రాష్ట్ర అభివృద్ధి రోడ్‌మ్యాప్‌పై సమగ్ర వివరణ
- ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక వాగ్దానాల అమలుపై వివరాలు
- మహిళలు, రైతులు, యువత సాధికారత చర్యలపై నివేదిక
- జాతీయ నాయకత్వ మార్గదర్శకత్వంతో అభివృద్ధి వేగవంతం లక్ష్యం

తెలంగాణ అభివృద్ధి పథాన్ని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ సహచరులు, రాష్ట్ర సీనియర్ నాయకులతో కలిసి న్యూఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వాన్ని కలిశారు. సీఎం నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర అభివృద్ధిపై చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్, దాని అమలుకు సంబంధించిన వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, కీలక ఎన్నికల వాగ్దానాల అమలు, విధాన నిర్ణయాలు, అభివృద్ధి పురోగతి, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు, నిర్మాణాత్మక సంస్కరణలపై అధిష్ఠానానికి ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. డిసెంబర్ 2023లో ఏర్పడిన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మహిళలు, రైతులు, యువత సాధికారత కోసం చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ నాయకత్వానికి వివరించారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి లభిస్తున్న విశేష మద్దతును కూడా సీఎం ప్రస్తావించారు. జాతీయ నాయకత్వం అందిస్తున్న మార్గదర్శకత్వం తెలంగాణ సమగ్ర, సమాన అవకాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## మరుగుజ్జు అసోసియేషన్ రజతోత్సవానికి ఆహ్వానం

- ఆహ్వాన పత్రిక స్వీకరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- కార్యక్రమానికి హాజరవుతానని హామీ
- నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



మరుగుజ్జు అసోసియేషన్ 25వ రజతోత్సవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వీకరించారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నేడు జరిగిన సమావేశంలో మరుగుజ్జు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి. మల్లేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. సంఘం ప్రతినిధులు తమ రజతోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఎమ్మెల్సీని కోరారు. వారి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన మల్లన్న, తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణకు తన వంతు సహకారంగా రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించి చెక్కును అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు ఆ చెక్కును సంఘం ప్రతినిధులకు అందించారు. సంఘం కార్యకలాపాలు సమాజానికి దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. మరుగుజ్జు సంఘం సభ్యులతో కాసేపు ముచ్చటించిన మల్లన్న, వారు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు,రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించాలి

- హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగలేఖ

**వేద న్యూస్, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగలేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అధిక శాతం ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కనీసం రానున్న 2026–27 బడ్జెట్‌లో అయినా ఆరు గ్యారెంటీల అమలుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్లలో కూడా వాటి అమలుకు సరైన కేటాయింపులు చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ప్రకటించిన సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీల మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. రానున్న బడ్జెట్‌లో హామీల అమలుకు తగిన కేటాయింపులు చేయకపోతే ప్రజల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

## పోటీ పరీక్షార్థులకు 'వారధి' ఉద్యోగార్థులకు 'సారథి'

- సిద్దిపేట యువత కోసం ప్రత్యేక హరీష్ అన్న ఉద్యోగ యాప్
- ఉచిత ఆన్‌లైన్ తరగతులు, నమూనా ప్రశ్నాపత్రాలు అందుబాటులో
- నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాప్ ప్రారంభం

**వేద న్యూస్, సిద్దిపేట**

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలవాలనే లక్ష్యంతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేకంగా హరీష్ అన్న ఉద్యోగ యాప్ను రూపొందించారు. హైదరాబాద్ వెళ్లి కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు ఖర్చు చేయకుండా, ఇంటి వద్ద నుంచే ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు వినే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను తన స్వంత ఖర్చులతో రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువత ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అవకాశం ఉంటుంది. సుమారు రెండు వేల గంటల వీడియో పాఠాలు, 400 నమూనా ప్రశ్నాపత్రాలు, నాలుగు వేల అధ్యయన పత్రాలు అందుబాటులో ఉంటాయి.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

# వైస్ చైర్మన్ శిరీష నవీన్‌కు సన్మానం



**వేదన్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌ను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. గోపయ్య గౌడ్, రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ జాబీర్, సహాయ కార్యదర్శులు పి. రోశయ్య, ఎస్వీవీ రెడ్డి, ఉమామహేశ్వరరావు, జీఆర్కే రెడ్డి, జీటీ చారి, ఎండీ ఆరిఫ్, సీహెచ్. ఎం. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



**వేద న్యూస్, రుద్రూర్:**

హిందూ సామ్రాట్, మహా యోధుడు, భారతమాత ముద్దుబిడ్డ, ధైర్యం, దేశభక్తి, ధీరత్వం, దైవభక్తికి మారుపేరైన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, పత్తి లక్ష్మణ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు గుండురి ప్రశాంత్ గౌడ్, పార్వతి మురళి, అనిల్, కుమ్మరి గణేష్, వడ్ల నరేష్, కాసుల శీను, బర్ల చిట్టి, ప్రణీత, హనుమాన్ స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకున్నారు. సింహాలు తమ చరిత్రను తాము చెప్పుకోకపోతే, వేటగాడు చెప్పిన కథలే చరిత్రగా మిగిలిపోతాయి అని పేర్కొంటూ, పూర్వీకుల చరిత్రను తెలుసుకుని సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని వక్తలు వివరించారు. శివాజీ మహారాజ్ వారసత్వంగా కాకుండా స్వయంకృషితో మహారాజ్యాన్ని నిర్మించిన మహానేత అని కొనియాడారు. ప్రజలు రాజ్యాన్ని తమదిగా భావించేలా చేసిన నాయకత్వం, సమానత్వం, న్యాయం, స్వాభిమానం ఆయన పాలనకు పునాదులని పేర్కొన్నారు. రైతుల గౌరవం కోసం పోరాడిన ధీరుడు, మహిళల భద్రతకు కట్టుబడిన పరిపాలకుడు, శక్తివంతమైన సైన్యం, నావికదళాన్ని నిర్మించిన వ్యూహకర్తగా ఆయనను స్మరించుకున్నారు. పరిపాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దూరదర్శి నాయకుడిగా శివాజీ మహారాజ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామ ప్రజలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మయ్యకు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అలువాల ధర్మయ్యను తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా అలువాల ధర్మయ్య మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలతో సమన్వయం సాధించి పార్టీ అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అలాగే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# గంగాధర విద్యార్థులకు రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో చోటు





**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటుకున్నారు. 10వ తరగతి విద్యార్థి మంచికట్ల నందకిషోర్, 9వ తరగతి విద్యార్థి మాలె కళ్యాణ్ రాష్ట్రస్థాయి రెండవ ఎడిషన్ సీఎం కప్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాబు శ్రీనివాస్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు జరుగనున్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో నందకిషోర్ పాల్గొనగా, నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో కళ్యాణ్ పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించనున్నాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న, ఉపసర్పంచ్ గాలిపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో ధమ్మని రాము, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రఘురాం, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు

# పేదల సొంతింటి కలను నెరవేర్చాం

- నియోజకవర్గంలో 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**వేదన్యూస్, దామరచర్ల:**

ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర సంవత్సరాల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. త్వరలోనే మిర్యాలగూడ పట్టణంలో మరో 2,500 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండలం సల్కునూర్, మిర్యాలగూడ మండలం తకెళ్లపాడు గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజలకు గృహ వసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పక్కనబెట్టి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ సంక్షేమ కార్యక్రమాల ఫలితంగానే ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ప్రజా ప్రభుత్వానికి అధిక స్థానాల్లో విజయం అందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సల్కునూర్ సర్పంచ్ సతీష్, తకెళ్లపాడు సర్పంచ్ చిటికల సుజాత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు బీసీ జేఏసీ కృతజ్ఞతలు

- బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం సుదీర్ఘ పోరాట ఫలితం
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**వేదన్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్‌గా బీసీ మహిళకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి బీసీ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 17 మున్సిపల్ చైర్మన్ పదవుల్లో బీసీలకు 50 శాతం అవకాశం దక్కడం బీసీల సుదీర్ఘ పోరాట ఫలితమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దఎత్తున ప్రాతినిధ్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. బీసీలు ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా తమకు రావాల్సిన హక్కుల కోసం మాత్రమే ఉద్యమిస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా బీసీలకు జనరల్ స్థానాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్ గుండు, నరేందర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

# సేంద్రియ వ్యవసాయంతో తక్కువ ఖర్చు

- దిగుబడి ఎక్కువ.. అధిక లాభాలు
- రసాయన ఎరువుల వల్ల నేలసారం తగ్గుతుంది
- ఏఓ రుషేంద్ర మణి



**వేద న్యూస్, దామరచర్ల:**

సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి తెలిపారు. గురువారం దామరచర్ల రైతు వేదికలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడకపోవడం వల్ల నేల సారం పెరగడంతో పాటు భూమి తేమను ఎక్కువకాలం నిలుపుకుంటుందని తెలిపారు. సహజసిద్ధమైన ఎరువులు వినియోగించడం వల్ల రసాయనాలపై పెట్టే ఖర్చు తగ్గుతుందని చెప్పారు. అలాగే పురుగుమందుల అవశేషాలు లేని, అధిక పోషక విలువలతో కూడిన ఆహారం లభిస్తుందని వివరించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల గాలి, నేల కాలుష్యం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉండటంతో రైతులకు మంచి ధర లభించే అవకాశం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయంలో దిగుబడి తగ్గుతుందనే అపోహ రైతుల్లో ఉందని, పూర్తిగా సేంద్రియ వ్యవసాయం చేయలేని పరిస్థితుల్లో కనీసం సెమీ ఆర్గానిక్ విధానాలను అనుసరించాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ పద్ధతులను పాటించడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు దిగుబడిపై ఉన్న భయం కూడా తొలగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. పార్వతి, నర్సాపురం సర్పంచ్ ఎస్. హత్య, రైతులు ఏ. సైదిరెడ్డి, అనురాధ, ధనలక్ష్మి, సంజీవ రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ శివయ్య సాక్షిగా ఆర్టీసీకి కాసుల పంట

- మహాశివరాత్రికి రూ.20 లక్షల ఆదాయం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన మూడు రోజుల జాతరతో ఆర్టీసీకి భారీ ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అదనపు బస్సులు నడిపించారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ, సిరిసిల్ల డిపోల నుంచి మొత్తం 25 బస్సులను ప్రత్యేకంగా నడిపినట్లు అధికారులు తెలిపారు. ఈ మూడు రోజుల వ్యవధిలో సుమారు రూ.20 లక్షల ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ వెల్లడించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్టాండ్ వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. జాతర సందర్భంగా భక్తుల రాకపోకలతో ఆర్టీసీ డిపోలకు గణనీయమైన ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



**వేద న్యూస్, పాపన్నపేట:**

- తపస్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ (వేతన సవరణ సంఘం)ను ప్రకటించాలని తపస్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు డిమాండ్ చేశారు. గురువారం పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన ఐదు డీఏలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి పీఆర్సీ ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సంఘం తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని మంగ నర్సింలు హెచ్చరించారు.

# కల్తీ కల్లుపై ప్రశ్నిస్తే దాడి చేస్తారా?

- సర్పంచ్ సమక్షంలోనే దాడి చేశారు
- సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి
- సాలూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఘటన



**వేద న్యూస్, నిజామాబాద్ జిల్లా:**

కల్తీ కల్లు విక్రయంపై ప్రశ్నించగా తనపై దాడి చేశారని నిజామాబాద్ జిల్లా సాలూర మండలం కేంద్రానికి చెందిన చందూరు సాయిలు ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సమక్షంలోనే కల్లు డిపో యజమాని లక్ష్మణ్ గౌడ్ తనపై దాడి చేశారని తెలిపారు. బాధితుడు చందూరు సాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఉన్న రెండు కల్లు డిపోలలో కల్తీ కల్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. గురువారం రాత్రి కల్లు సేవించేందుకు వెళ్లినప్పుడు కల్లు నాణ్యత సరిగా లేదని ప్రశ్నించగా వివాదం తలెత్తిందన్నారు. ఈ విషయమై శుక్రవారం గ్రామ సర్పంచ్ ఫోన్ చేసి గ్రామపంచాయతీ కార్యాలయానికి పిలిపించారని, అక్కడ ఎంపీడీవో, ఎంఆర్ఓ కార్యాలయాల సమీపంలో అందరి సమక్షంలోనే కల్లు డిపో యజమాని లక్ష్మణ్ గౌడ్ తనపై దాడి చేశారని వాపోయారు. కల్తీ కల్లు వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, సంబంధిత అధికారాలు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇక ఈ విషయంపై కల్లు డిపో యజమాని లక్ష్మణ్ గౌడ్‌ను సంప్రదించగా, చందూరు సాయిలు కావాలనే తమపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కల్లు సీసాలు పగలగొట్టి నష్టం కలిగించడంతో పాటు దుర్భాషలాడారని, తమను బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- కరెంట్ తీగలకు జెండా స్తంభం తగలడంతో విషాదం

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగిన విషాదకర ఘటనలో విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం, దర్గా కాజీపేటకు చెందిన పొతరబోయిన శివకుమార్ (22) తన స్నేహితులు దినేష్, రోహిత్‌లతో కలిసి ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా బుధవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో కాజీపేట దర్గా బస్టాండ్ వద్ద జెండా ఎగురవేయడానికి ఇనుప జెండా స్తంభాన్ని నిలబెడుతున్నారు. ఈ క్రమంలో ఆ స్తంభం ప్రమాదవశాత్తు పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ ప్రవహించి శివకుమార్, దినేష్‌లు తీవ్రంగా షాక్‌కు గురయ్యారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా, శివకుమార్ మార్గమధ్యలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన దినేష్ ప్రస్తుతం ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# ఛాంబర్ కేటాయింపు నిబంధనలకు విరుద్ధం

- తక్షణమే తొలగించాలని డిప్యూటీ కమిషనర్‌కు సీపీఐ వినతి



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్‌కు ప్రత్యేక ఛాంబర్ కేటాయించడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. అధికారులు వెంటనే ఆ ఛాంబర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ ప్రతినిధి బృందం డిప్యూటీ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించింది. మున్సిపల్ నిబంధనల్లో డిప్యూటీ మేయర్‌కు ప్రత్యేక ఛాంబర్ కేటాయించే నిబంధన ఎక్కడా లేదని, గతంలో కూడా ఈ అంశం వివాదాస్పదమైందని సురేందర్ రెడ్డి తెలిపారు. అవినీతి రహిత పరిపాలన అందిస్తామని చెప్పిన బీజేపీ నేతలు, గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను కొనసాగించడం సరికాదని విమర్శించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి డిప్యూటీ మేయర్‌కు ఛాంబర్ కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, అలాగే మున్సిపల్ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. నగర పాలక సంస్థలో మేయర్‌నే ప్రథమ పౌరుడిగా పరిగణిస్తారని, మేయర్‌కే ప్రత్యేక ఛాంబర్ ఉండాలని, మిగతా కార్పొరేటర్లు సమాన హోదాలో ఉంటారని పేర్కొన్నారు. ఈ విషయంలో బీజేపీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, గామినేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

# కేయూ క్యాంపస్‌లో పగిలిన పైప్‌లైన్

- గంటల తరబడి వృథా అయిన తాగునీరు
- పలు కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో జేసీబీ తవ్వకాల సమయంలో ప్రధాన నీటి సరఫరా పైప్‌లైన్ పగిలి గంటల తరబడి తాగునీరు వృథా అయింది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం దూర విద్యా కేంద్రం ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనుల సమయంలో చోటుచేసుకుంది. కేబుల్ కనెక్షన్ పనుల కోసం జేసీబీతో తవ్వకాలు నిర్వహిస్తుండగా భూమిలో ఉన్న ప్రధాన పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో భారీగా నీరు పైకి ఎగిసిపడుతూ సుమారు ఆరు నుంచి ఏడు గంటల పాటు వృథాగా పారిపోయింది. పైప్‌లైన్ స్థానాన్ని ముందుగా గుర్తించకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి విశ్వవిద్యాలయం సమీపంలోని ఫిల్టర్ బెడ్‌కు ఈ పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి భీమారం, పలివెల్పుల, హసన్‌పర్తి, కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని పలు కాలనీలకు తాగునీరు అందుతుంది. పైప్‌లైన్ దెబ్బతినడంతో ఈ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని కేయూ అధికారులు, జీడబ్ల్యూఎంసీ అధికారులకు తెలియజేయగా, వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు కోరుతున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సిటీ కాలేజీలో 'మేనేజ్‌మెంట్ ఫెస్ట్' ప్రారంభం

- ఏఐ అనుసంధానం, నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్, హైదరాబాద్:**

గవర్నమెంట్ సిటీ కాలేజ్ (అటానమస్)లో మూడు రోజుల 'మేనేజ్‌మెంట్ ఫెస్ట్2026'ను ఘనంగా ప్రారంభించారు. అకడమిక్ విద్యను కార్పొరేట్ రంగ అవసరాలతో అనుసంధానించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా. పి. శాంతి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధునిక వ్యాపార రంగంతో వేగంగా అనుసంధానమవుతోందని తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు విద్యార్థులు కొత్త టెక్నాలజీలు నేర్చుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. జె. నీరజ మాట్లాడుతూ, కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. లింక్డ్‌ఇన్ వంటి వేదికల ద్వారా ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవాలని, అదనపు ప్రొఫెషనల్ సర్టిఫికేట్లు పొందడం ద్వారా మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా. ఎస్. ఝాన్సీ రాణి మాట్లాడుతూ, విద్యార్థుల వ్యూహాత్మక, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా ఫెస్ట్ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. మొదటి రోజు మేనేజ్‌మెంట్ క్విజ్, బిజినెస్ క్విజ్, యాడ్–మ్యాడ్, బిజినెస్ డమ్ షరాడ్స్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్నకు కాసుల పంట

- శివరాత్రి జాతర ఆదాయం రూ.1.43 కోట్లు
- మూడు రోజుల్లో 2.59 లక్షల మంది భక్తుల దర్శనం
- ప్రసాదాల ద్వారానే రూ.40 లక్షల ఆదాయం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భారీగా ఆదాయం సమకూరింది. ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరిగిన జాతరలో స్వామివారికి మొత్తం రూ.1,43,91,770 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. జాతర సందర్భంగా రాజన్న క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ మూడు రోజుల్లో రాజన్న అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని కలుపుకుని మొత్తం 2,59,598 మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆదాయ వివరాల ప్రకారం ఫిబ్రవరి 14న రూ.21,34,560, ఫిబ్రవరి 15న రూ.71,35,365, ఫిబ్రవరి 16న రూ.51,21,845 ఆదాయం లభించింది. ప్రసాదాల అమ్మకాల ద్వారానే రూ.40,04,075 సమకూరగా, కోడె మొక్కుల ద్వారా రూ. 11,52,580, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.5,57,400, తలనీలాల సమర్పణ ద్వారా రూ.3,34,050 ఆదాయం వచ్చింది. అదేవిధంగా బద్ది పోచమ్మ ఆలయ కానుకల ద్వారా రూ.43,520, ఇతర విభాగాల ద్వారా రూ.51,72,055 సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. జాతర ముగిసిన అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉందని ఆలయ అధికారులు తెలిపారు.

# సీఎం కప్ పోటీలకు ఊరుగొండ విద్యార్థులు




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

హైదరాబాద్‌లో ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎస్. అక్షయ, బి. సుస్మిత హనుమకొండ జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వంగేటి లక్ష్మీనారాయణ విద్యార్థినులను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయిలో రాణించే అవకాశం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డా. ఆర్. గణపతి, అనిత కుమారి, డా. వంగల జగన్, వసుంధర దేవి, రాజేంద్రప్రసాద్, సౌజన్య, శ్రీనివాస్, సురేందర్ తదితరులు విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వేద న్యూస్, మంచిర్యాల:**

ప్రభుత్వం విద్యారంగ బలోపేతం కోసం చేపట్టిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పరిధిలో నిర్మాణంలో ఉన్న కొత్త భవనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని సూచించారు. అలాగే బెల్లంపల్లి పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఒకే చోట అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

- భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయంటూ ఆందోళన



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి సమీపంలోని మూలవాగులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను బొల్లారం గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలింపులు జరుగుతుండటంతో గ్రామానికి ప్రమాదం ఏర్పడుతోందని, ఇప్పటికే నాలుగు ఇళ్లు ప్రమాద అంచుకు చేరుకున్నాయని తెలిపారు. ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేసి రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహశీల్దార్‌ను కలిసి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు అధికారులను కోరారు.

వేద న్యూస్

శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

## టాస్క్ శిక్షణకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



**వేద న్యూస్, మంచిర్యాల:**

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో 5వ బ్యాచ్ శిక్షణకు ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ సాయి కుమార్ తెలిపారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు నిర్వహించబడుతుందని, ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. సి, సి++, హెచ్‌టీఎంఎల్, సిఎస్‌ఎస్, జావాస్క్రిప్ట్, జావా, పైతాన్, బూట్‌స్ట్రాప్, వెబ్ డెవలప్మెంట్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ వంటి అంశాల్లో శిక్షణ అందిస్తారని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయసు కలిగి, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని సూచించారు. ఈ నెల 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు 7989733351 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- ఫెర్టిలైజర్ యాప్‌తో పంపిణీ సులభం
- గ్రోమోర్ ఎరువుల దుకాణంలో ఇంచార్జి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లాలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. గురువారం తంగళ్ళపల్లిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఫెర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకున్న రైతుల వివరాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలను లెక్కింపజేసి సరఫరా ప్రక్రియను సమీక్షించారు. ఎరువుల పంపిణీ పారదర్శకంగా కొనసాగుతోందని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఫెర్టిలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా ఎరువులు బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 92,735 సంచుల యూరియా అందుబాటులోకి రాగా, 84,068 మంది రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నారు. వీరిలో 79,948 మంది రైతులు ఇప్పటికే ఎరువులు పొందగా, ప్రస్తుతం 11,694 సంచుల యూరియా నిల్వ ఉందన్నారు. ఇంకా 740 మంది రైతులు ఎరువులు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు




- శివాజీ మహారాజ్ బహుజనుల ఆరాధ్య రాజు
- బహుజన విద్యార్థి సంఘం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

బహుజన విద్యార్థి సంఘం (బీఎస్‌సీ) ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం పోరాడిన మహానేత అని అన్నారు. ప్రజలు స్వయంగా పాలించుకునే రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో ఆయన పోరాటం చేశారని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ బహుజనులకు స్ఫూర్తిదాయక నాయకుడిగా నిలిచారని, ఆయన చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఛత్రపతి సాహు మహారాజ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహానేతలకు శివాజీ మహారాజ్ మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. బహుజన సమాజ అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘం నాయకులు భాశిపాక తరుణ్, కడదరాపు నవీన్, దాసరి అఖిల్, దైనంపెల్లి అన్వేష్, మేఘన, శ్రావణి, భవాని, మధుకర్, రాజు, కుమార్, శివ, రమేష్, నవీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన మహానేత

- ఘనంగా ఛత్రపతి జయంతి వేడుకలు

**వేదన్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి శివాజీ మహారాజ్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ చిన్న వయసులోనే ధైర్యసాహసాలతో మొగల్ సామ్రాజ్యానికి సవాలు విసిరి హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన మహానేత అని కొనియాడారు. ధర్మ పరిరక్షణ, సనాతన సంస్కృతి రక్షణ కోసం ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు రాస మల్ల శ్రీనివాస్, జంగ జైపాల్, దొంగల రాములు, జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, చుక్కల శ్రీకాంత్, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ పుట్టినరోజు సందర్భంగా హ్యాండ్‌బోర్ ఏర్పాటు

**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం ఎంపీ రఘురామ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కారేపల్లి మండలం పొలంపల్లి తండాలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హనుమాన్ గుడి సమీపంలో హ్యాండ్‌బోర్ ఏర్పాటు చేశారు. పీఎస్ఆర్ యూత్ అధ్యక్షుడు జర్పల ధోని నాయక్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఈ హ్యాండ్‌బోర్ మంజూరైనట్లు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ధోని నాయక్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధరావత్ హేమలత మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు సక్రు, ధారావత్ బద్రునాయక్, ఉపసర్పంచ్ గుగులోతు సర్వన్, వార్డు సభ్యులు లావణ్య, రమేష్, కవిత, కాంగ్రెస్ నాయకులు భీముడు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కల్యాణ్, గ్రామ పెద్దలు ధారావత్ భద్య, భూక్య బద్రు, గుగులోతు భీముడు, మునీరాం, రమేష్, భూక్య బాలు, లాలూ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ మండల బాధ్యులు మార్త మార్కండేయ మాట్లాడుతూ.. హైందవ ధర్మరక్షణ కోసం శివాజీ మహారాజ్ చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. మొగలాయిల దౌర్జన్యాలను ఎదిరించి జాతిని రక్షించిన మహాయోధుడిగా ఆయనను కొనియాడారు. మహనీయుల జయంతులు, వర్ధంతి కార్యక్రమాలు భావితరాలకు దేశభక్తిని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని పాల్గొన్నవారు తెలిపారు. శ్రీశైలంలో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రం తెలుగు రాష్ట్రాల గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినయ్, రామాలయం పూజారి కృష్ణస్వామి, ప్రమోద్, నాగరాజు, రవి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- లేకుంటే ఆందోళన చేస్తాం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి



**వేదన్యూస్, శంకరపట్నం:**

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. గురువారం శంకరపట్నం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వంలో చెక్కులు మంజూరైనప్పటికీ, కొంతమంది అధికార పార్టీ నాయకులు కమిషన్ ఇచ్చిన వారికే చెక్కులు అందజేస్తున్నారని ఆరోపించారు. మరికొన్ని సందర్భాల్లో చెక్కులను ఇతరుల ఖాతాల్లో జమచేసి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పేదల వైద్య ఖర్చుల కోసం అందించే సీఎంఆర్ఎఫ్ సహాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు రోజులలో లబ్ధిదారులకు న్యాయం చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వెంకటరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాసమల్ల శ్రీనివాస్, రాజిరెడ్డి, బిజిలు సారయ్య, చుక్కల శ్రీకాంత్, బొజ్జ సాయి ప్రకాష్, కుమార్, నాంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

- ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

**వేద న్యూస్, హనుమకొండ:**

తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి, దెంచనాల కివాన్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేంద్ర నాగవెల్లి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమాన్ని రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది వద్దిరాజు గణేష్ ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, రక్తదానం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో సుమారు 40 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.




# అంగరంగ వైభవంగా శివ పార్వతి కల్యాణం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో గురువారం శివ పార్వతి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారు, పోచమ్మ తల్లి, నల్లపోచమ్మ తల్లి, దుర్గమ్మ ఆలయాల్లో ఉదయం గడపపెట్టే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నీలకంఠేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయంలో శివపార్వతి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్–దివ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతి విగ్రహాలను డప్పు సప్పుల మధ్య గ్రామంలో ఊరేగించారు. ఈ వేడుకల్లో గ్రామస్థులు, భక్తులు భక్తి భావంతో పాల్గొన్నారు.



# రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా రావాలి

- హైడ్రా కమిషనర్‌ను కలిసిన దివ్యాంగులు
- స్వేచ్ఛ వికలాంగుల కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కమిషనర్



**వేద న్యూస్, హైదరాబాద్ :**

వారంతా వరంగల్ పట్టణంలోని స్వేచ్ఛ వికలాంగుల కమిటీ ప్రతినిధులు.. అందులో కొంతమంది సరిగా నడవలేరు.. మరి కొంతమంది కనీసం నిల్చోలేరు. అయినా జీపు కట్టించుకుని వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్ళారు. నేరుగా హైడ్రా కార్యాలయానికి చేరుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని కలిసారు. మేమంతా మీ అభిమానులమని చెప్పారు. వరంగల్‌లో ప్రభుత్వ భూములతో పాటు..కబ్జాల చెర నుంచి పేద, మధ్య తరగతి వారి ఇంటి స్థలాలు విడిపించిన తీరును గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లో కూడా కబ్జాదారుల భరతం పడుతున్న తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఒక సాహసోపేత నిర్ణయం అయితే.. దానికి కమిషనర్‌గా మిమ్ములను నియమించడం మరింత అభినందించదగ్గ విషయమని కొనియాడారు. వరంగల్ పట్టణంతో పాటు.. రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా రావాలని కోరారు. అప్పుడే భూ కబ్జాలు ఆగుతాయన్నారు. చెరువులు, కాలువలు, రహదారులు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరి రక్షించుకోవాలంటే రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా ఉండాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన కమిటీని కమిషనర్‌కు పరిచయం చేసుకున్నారు. కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. స్వేచ్ఛ వికలాంగుల కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అసద్, ప్రధాన కార్యదర్శి తవుడిశెట్టి జ్యోతి, వైస్ ప్రెసిడెంట్ బొల్లం చైతన్య, ట్రెజరర్ శర్ల శివతేజతో పాటు పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఎంపీ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు




**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి 65వ జన్మదిన వేడుకలను గురువారం కారేపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచులు బానోత్ హీరాలాల్, మేదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎంపీ రఘురాంరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజా ప్రతినిధి అని కొనియాడారు. పార్లమెంట్‌లో ప్రజల గొంతుకగా నిలిచి జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోత్ భీముడు నాయక్, సురేందర్ మనియార్, అడ్డగోడా ఐలయ్య, తాజుద్దీన్, అదేర్ల రాములు, చాంద్ పాషా, దారావత్ వినోద్ నాయక్, గాంధీ, షఫీ, యాకూబ్, రామారావు, జావీద్, రాజశేఖర్, అజాం, రియాజ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ బహుజనుల ఆరాధ్య రాజు

- టేక్మాల్ మండలం ఎల్లుపేటలో ఘనంగా జయంతి



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను బహుజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ జెండాను ఆవిష్కరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పెద్ద దర్శనం బిర్రప్ప యాదవ్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం పోరాడిన మహానేత అని అన్నారు. మరాఠా ప్రజల స్వయంపాలన కోసం పోరాడి రాజ్యాన్ని రక్షించిన గొప్ప నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. బహుజన సమాజానికి ఆయన స్ఫూర్తిదాయకుడని, సమానత్వం, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. శివాజీ మహారాజ్ చరిత్రను దళిత, గిరిజన, బహుజనులు తెలుసుకుని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన ఛత్రపతి సాహు మహారాజ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులకు మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘం నాయకులు వై. సంజీవరెడ్డి, సిద్ధిరాములు, కె. వీరేశం, కుమ్మరి లక్ష్మయ్య, ప్రశాంత్ గౌడ్, దుర్గపతి గౌడ్, బి. మల్లయ్య, విశాల్, ఏలేందర్, కుమ్మరి మల్లేశం, బెస్త చింటూ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ భారత దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత అని కొనియాడారు. మొగలాయిల దురాక్రమాలను ఎదిరించి ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన పరిపాలన అందించిన పరిపాలనా దక్షుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్త సత్తయ్య, పొంచెట్టి రాకేష్, మట్కామ్ మల్లేశం, మార్త రాజు, మోత్కుపల్లి రాజశేఖర్, లింగంపల్లి మదన్, లింగాల మల్లయ్య, పోతరాజు రవి, పొంచెట్టి మల్లేశం, మర్రి మల్లేశం, పులి నారాయణ, గుగ్గిళ్ల సాగర్, వెంగళ వెంకటేష్, మేడిశెట్టి శ్రీహరి, లోలపు అభిలాష్, మర్రి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావుకు పదోన్నతి

- డిప్యూటీ సీఈవోగా నియామకం



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న పొన్నూరు శ్రీనివాసరావుకు డిప్యూటీ సీఈవోగా పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతి పొందిన 10 మంది అధికారుల జాబితాలో ఆయన స్థానం సంపాదించడం విశేషం. సింగరేణి మండలంలో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి కార్యక్రమాల అమలులో శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడం, పారదర్శక పరిపాలనలో చూపిన ప్రతిభకు ఈ పదోన్నతి గుర్తింపుగా భావిస్తున్నారు. పదోన్నతి నేపథ్యంలో సింగరేణి ఎంపీడీవో స్థానం ఖాళీ కానుంది. పూర్తి స్థాయి ఉత్తర్వులు వెలువడిన అనంతరం శ్రీనివాసరావు నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు. అప్పటి వరకు మండల పరిపాలన కొనసాగేందుకు తాత్కాలికంగా ఇన్‌చార్జి ఎంపీడీవోను నియమించే అవకాశం ఉంది. శ్రీనివాసరావుకు పదోన్నతి లభించడంతో జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలి

- అడ్డోగులుగా బెల్ట్ షాపులు, సిట్టింగ్ సదుపాయాలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న వైన్ షాపులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు వైన్ షాపులు అధికారుల అండదండలతో బార్లను తలపించే విధంగా సిట్టింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, గాంధీచౌక్ ప్రాంతాల్లో వాహనాలు నిర్బంధంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు పెరిగిపోవడంతో మద్యం సులభంగా లభ్యమవుతుండటంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. యువత మద్యానికి బానిసలై ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేసి, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

# నక్షా స్కీంపై అవగాహన కార్యక్రమం

- అమలు విధానం, లాభాలపై ప్రజలకు వివరాలు



**వేద న్యూస్, హుస్నాబాద్:**

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నక్షా స్కీంపై గ్రామసభను మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మికొమురయ్య, వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, చిత్తారి రవిందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా సర్వేయర్ సుదర్శన్, డిప్యూటీ సర్వేయర్ బాలయ్య, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణలు నక్షా స్కీం అమలు విధానం, లాభాలను ప్రజలకు వివరించారు. డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పట్టణ ప్రాంతాల్లో భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించి డిజిటల్ రికార్డులు రూపొందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్ ప్రాజెక్ట్ ద్వారా భూ రికార్డుల ఆధునీకరణ, ఆస్తి యాజమాన్య స్పష్టత, భూ వివాదాల తగ్గింపు, పట్టణ ప్రణాళిక మెరుగుదల లక్ష్యంగా పనిచేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ముఖ్యమంత్రి సహాయనిధికి అర్హులైన లబ్ధిదారులందరికీ పార్టీలకు అతీతంగా అందిస్తున్నామని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఇల్లంతకుంట మండలంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 63 మందికి సీఎంఆర్ఎఫ్, 85 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్య ఖర్చుల తో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. అలాగే ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా సహాయపడుతున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమ మే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఫారుక్, ఎంపీ డీవో శశికళ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు తది తరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామపంచాయతీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి రైతులకు సహజ వ్యవసాయం పద్ధతులపై వివరించారు. ఈ సందర్భంగా జీవామృతం, బీజామృతం వంటి సహజ పదార్థాలను ఎలా తయారు చేయాలి, వాటిని క్షేత్రస్థాయిలో ఎలా వినియోగించాలో రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారం పెరగడంతో పాటు ఖర్చులు తగ్గి రైతులకు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ చొప్పరి భూమయ్య, ఉప సర్పంచ్ బస్వరాజు జనార్దన్, గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్, సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

## కాలేజీ బిల్డింగ్‌పై నుంచి దూకి

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

**వేద న్యూస్ హైదరాబాద్ :** కాలేజీ బిల్డింగ్ మూడో ఫ్లోర్ నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి) పాల్పడింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. భవాని కాలనీలోని శ్రీ వైష్ణవి మహిళా జూనియర్ కళాశాలలో రితిక అనే బాలిక ఇంటర్ సెకండర్ ఇయర్ చదువుతున్నది. ఏమైందో తెలియదు కాని బిల్డింగ్ పై నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే బాలికను హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వేద న్యూస్
శుక్రవారం ఫిబ్రవరి 20, 2026

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆసం సంజీవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి జగిత్యాల జిల్లా డీపీవో రేవంత్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్, ఎస్సై నవీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీవో రేవంత్ మాట్లాడుతూ, విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఎంపీడీవో గణేష్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. తహసీల్దార్ వరప్రసాద్ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, కృషితో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఎస్సై నవీన్ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

**– పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో రూ.10 లక్షలతో జూనియర్ కళాశాల ప్రహరీ గోడ, రైతు వేదిక ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.31 లక్షలతో అంబేద్కర్ చౌరస్తా సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతగిరి గ్రామంలో రూ.1.5 కోట్లతో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా, రేపాక గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనం, రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. సోమారంపేటలో రూ.4 లక్షలతో బస్ షెల్టర్, హనుమాన్ టెంపుల్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, ఎస్సీ కాలనీలో హైమాస్ లైట్లను ప్రారంభించారు. వెంకట్రావుపల్లిలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ



భవనం, గూడెపుపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం

**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల కేంద్రంలో రేపు నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దూరిశెట్టి అనుదీప్‌ను సామాజిక కార్యకర్త వాంకుడోత్ గాంధీ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వాంకుడోత్ గాంధీ నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొని గిరిజనులకు ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని వివిధ తండాలు, గ్రామాల నుంచి గిరిజనులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మిర్చి నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలి

**– కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**




మిర్చి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డ్లో మిర్చి రాబడులు, నాణ్యత, ధరల పరిస్థితిపై సమీక్ష నిర్వహించినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రావు జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ , మార్కెట్ కమిటీ కార్యదర్శి ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్టేట్ ప్రెసిడెంట్ రవీంద్రెడ్డి, వేద ప్రకాష్, వెల్ది సాంబయ్య, మార్కెట్ కార్యదర్శి మల్లేశంతో సమావేశమయ్యారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధరలు నమోదవుతున్నప్పటికీ, తేమతో కూడిన మిర్చి తీసుకురావడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గుతోందని పేర్కొన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలు, విదేశీ వ్యాపారులు కొనుగోలుకు నిరాసక్తత చూపుతున్నారని తెలిపారు. రైతులు సరైన ధర కోల్పోకుండా నాణ్యతపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మిర్చి సంచుల బరువు 49 కిలోలకు మించకుండా తీసుకురావాలని, అలా చేస్తే ఎగుమతి, కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు లభిస్తాయని వివరించారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఎనుమాముల మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దైవభక్తి, ధీరత్వానికి మారుపేరు శివాజీ

**– వేములపల్లి మండలం శెట్టిపాలెంలో ఘనంగా జయంతి వేడుకలు**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్ట మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యం, దేశభక్తి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి స్వరాజ్యం స్థాపించిన గొప్ప మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ జీవితాన్ని నవతరం ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కట్ట వెంకటయ్య, సైదులు, వీరస్వామి, చెంచు, సాయి, మల్లయ్య, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర విమర్శలు

**వేద న్యూస్ అమరావతి:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో స్పందించారు. బడ్జెట్, విమాన ప్రయాణాలు, ప్రభుత్వ విధానాలపై జగన్ చేసిన వ్యాఖ్యలు అసత్యాలతో నిండినవని ఆయన ఆరోపించారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌మోహన్ రెడ్డేనని ఘాటుగా విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని అచ్చెన్నాయుడు ఆరోపించారు. అంకెల గారడీతో ప్రజలను తప్పుదోవ పట్టించిన వారే ఇప్పుడు తప్పుడు లెక్కలంటూ ఆరోపణలు చేయడం విచిత్రమన్నారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికి వినియోగమవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగన్ తాడేపల్లి నివాసానికే పరిమితమయ్యారని, ప్రజా ధన వినియోగంపై అనేక ప్రశ్నలు మిగిల్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల కోసం ప్రయత్నాలు చేస్తుంటే దానిని జల్సాలుగా అభివర్ణించడం సరైంది కాదన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై సమాధానం చెప్పలేక కొత్త



వివాదాలు సృష్టిస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. అసెంబ్లీలో చర్చించేందుకు ధైర్యం లేక మీడియా సమావేశాల ద్వారా ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, వాస్తవాలను అంగీకరించాలని ఆయన సూచించారు.

## మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం

**వేద న్యూస్ అమరావతి:**

విశాఖ నగరంలోని న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగిన ఘటన కలకలం రేపింది. చిన్నారిని తినుబండారాలు కొనిపెడతానని నమ్మబలికి తీసుకెళ్లిన వ్యక్తి దారుణానికి పాల్పడేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాలికను రక్షించారు. బాధిత చిన్నారిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా ఎరిపిల్లి యోగి అనే వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఘటనతో ప్రాంతంలో ఆందోళన వాతావరణం నెలకొంది.



## చైతన్యం, సేవాభావం, ప్రపంచ ఐక్యతకు పిలుపు

- యువతలో విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత పెంపుకు వేదిక
- సమస్యలపై చర్చ నుంచి కార్యాచరణ దిశగా అడుగులు
- మానవత్వం, శాంతి, సహకారం భవిష్యత్ ప్రపంచానికి మార్గం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచం మార్పుల మలుపులో నిలిచిన ఈ కాలంలో ఆలోచనల శక్తి మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. సమాజ సమస్యలను కేవలం గమనించడం కాదు, వాటిపై లోతుగా ఆలోచించి పరిష్కార దిశగా కదలాలని గుర్తు చేసే సందర్భమే ప్రపంచ ఆలోచనా దినం. యువతలో చైతన్యం, సేవాభావం, ప్రపంచ ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ రోజు గుర్తింపు పొందింది. బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే ఆలోచనతో కూడిన చర్య అవసరమని ఇది స్పష్టం చేస్తుంది. ఆలోచన ప్రతి మార్పుకు మూలం. ఒక సమస్యను గుర్తించడం, దాని మూలాలను విశ్లేషించడం, పరిష్కార మార్గాలను రూపొందించడం ఇవే సమాజ పురోగతికి దారి తీస్తాయి. పర్యావరణ సంక్షోభం, పేదరికం, నిరుద్యోగం, విద్యా అసమానతలు, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు వస్తున్నాయి. కానీ చర్చతోనే సరిపోదు.

యువత చైతన్యంతో ముందుకు వచ్చి కార్యాచరణలో పాల్గొంటేనే స్థిరమైన మార్పు సాధ్యమవుతుంది. ప్రపంచ ఆలోచనా దినం యువతకు ఒక కీలక సందేశాన్ని అందిస్తుంది. విమర్శించడం సులభం; కానీ పరిష్కారాలను ఆలోచించడం సవాలు. సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను కార్యరూపం దాల్చే దిశగా ప్రయత్నించాలి. సేవాభావంతో పనిచేయాలి. చిన్న చర్యలు కూడా పెద్ద ప్రభావం చూపగలవు. ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం, ఒక పాఠశాలలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం ఇవన్నీ ఆలోచన నుంచి కార్యాచరణకు మార్గాలు.

ప్రపంచ ఐక్యత ఈ దినం ప్రధాన సందేశం. దేశాలు, సంస్కృతులు, మతాలు వేర్వేరు అయినప్పటికీ మానవత్వం ఒకటే అన్న భావన బలపడాలి. పరస్పర గౌరవం, సహకారం, శాంతి భావం లేకుండా అభివృద్ధి అసంపూర్ణం. యువతలో ఈ విలువలు బలపడితే భవిష్యత్ ప్రపంచం మరింత సమన్వయంతో ముందుకు సాగుతుంది.

సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన ఈ కాలంలో సమాచారానికి కొదవలేదు. అయితే సమాచారాన్ని అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. విమర్శనాత్మక ఆలోచన లేకుండా సమాచారం మాయాజాలంగా మారవచ్చు. అందుకే యువతలో విశ్లేషణాత్మక దృక్పథం, పరిశీలనా శక్తి పెంపొందించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థలు ఈ దిశగా కీలక పాత్ర పోషించాలి. ప్రపంచ ఆలోచనా దినం ఒక స్ఫూర్తిదాయక సందర్భం. ఆలోచనతో మొదలైన మార్పు చర్యతో పూర్తవుతుంది. సమాజ సమస్యలపై స్పందించే యువతే భవిష్యత్తు నాయకులు. చైతన్యం, సేవాభావం, ఐక్యత కలిసినప్పుడే శాంతియుత, సమాన ప్రపంచ నిర్మాణం సాధ్యమవుతుంది.

మొత్తంగా ఈ దినం మనకు ఒక స్పష్టమైన పిలుపు ఇస్తుంది ఆలోచించాలి, స్పందించాలి, చర్య తీసుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితం కాకుండా సమాజ ప్రయోజనాలను ముందుకు పెట్టాలి. యువతలో సృజనాత్మక ఆలోచన, బాధ్యతాయుత ధోరణి పెరిగితేనే ప్రపంచం మంచి దిశగా సాగుతుంది. ప్రపంచ ఆలోచనా దినం ఆ మార్గాన్ని చూపించే ఒక ప్రేరణాత్మక సందర్భం. ప్రపంచ ఆలోచనా దినం యువతకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. కేవలం విమర్శించడం కాకుండా, సృజనాత్మక పరిష్కారాలను ఆలోచించాలి. సేవాభావంతో పనిచేయాలి. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాలి. చిన్న చిన్న చర్యలు కూడా పెద్ద మార్పులకు నాంది కావచ్చు. ఒక చెట్టు నాటడం, ఒక పిల్లవాడికి విద్య అందించడం, ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఇవే ఆలోచన నుంచి కార్యాచరణకు మార్గాలు.

ప్రపంచ ఐక్యత కూడా ఈ దినం ప్రధాన భావం. దేశాలు, మతాలు, సంస్కృతులు వేరైనా మానవత్వం ఒకటే అన్న సందేశాన్ని ఈ రోజు గుర్తు చేస్తుంది. పరస్పర గౌరవం, సహకారం, శాంతి భావం పెరిగితేనే ప్రపంచం స్థిరంగా అభివృద్ధి చెందుతుంది. యువతలో ఈ విలువలు బలపడితే భవిష్యత్తు మరింత శాంతియుతంగా ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన ఈ కాలంలో సమాచారానికి హద్దుల్లేవు. అయితే సమాచారం మాత్రమే సరిపోదు; విమర్శనాత్మక ఆలోచన అవసరం. వాస్తవాలను పరిశీలించడం, వివిధ కోణాల్లో ఆలోచించడం, సమగ్ర దృక్పథం కలిగి ఉండడం ఇవే సమాజానికి అవసరమైన లక్షణాలు. ప్రపంచ ఆలోచనా దినం ఈ విలువలను పెంపొందించేందుకు ఒక అవకాశం.

# అండర్ 18... ఐశ్వర్య రాజేశ్ కొత్త సినిమా

**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ నటి ఐశ్వర్య రాజేశ్, నటుడు విక్రాంత్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'అండర్ పద్దెనిమిది' అనే పేరును ఖరారు చేశారు. ఈ చిత్ర పేరును ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ ఆవిష్కరించడం విశేషంగా నిలిచింది. దర్శకుడు కార్తీక్ పెరుమాళ్‌సామి గతంలో వెట్రిమారన్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేశారు. ఎస్ ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై బి. జగదీశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మద్రాస్‌కారన్' విజయానంతరం ఈ సంస్థ నిర్మిస్తున్న మరో ప్రాధాన్యమైన చిత్రం ఇదే. నిజ జీవిత ఘటనల ఆధారంగా భావోద్వేగాలతో నిండిన నేర కథాచిత్రంగా ఇది రూపుదిద్దుకుంటుందని చిత్రబృందం తెలిపింది. ఒక నేరం కారణంగా తీవ్రంగా ప్రభావితమైన కుటుంబం ఎదుర్కొనే పరిస్థితులు, నేర ప్రపంచంలోని క్రూరమైన కోణాలు ఈ కథలో ప్రధానంగా ఉండనున్నాయి. తమిళనాడులో పెద్దగా వెలుగులోకి రాని కొన్ని సంఘటనలను కథా నేపథ్యంగా ఎంచుకున్నట్లు సమాచారం. సామాజిక వాస్తవికతతో పాటు కుటుంబ అనుబంధాలను మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాణ సంస్థ ధీమా వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో కిశోర్ సహా పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. హోసూర్, చెంగల్పట్టు, చెన్నై ప్రాంతాల్లో వాస్తవ ప్రదేశాలలో చిత్రీకరణ జరపాలని యోచిస్తున్నారు. ఈ చిత్రానికి వేల్‌రాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇళంగో కృష్ణన్, కార్తీక్ నేతా గీతాలకు సాహిత్యం సమకూరుస్తున్నారు.



# 'కల్ట్'తో విశ్వక్ కొత్త ప్రయోగం..

**వేద న్యూస్ డెస్క్:**




మాస్ కా దాస్‌గా గుర్తింపు పొందిన విశ్వక్ సేన్ మరోసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం కల్ట్. ఇప్పటికే ఆయన తెరకెక్కించిన ఫలక్‌నుమా దాస్, దాస్ కా దమ్కీ చిత్రాలు మంచి స్పందన అందుకున్న నేపథ్యంలో ఈ సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉత్కంఠ భరితమైన, సాహసోపేతమైన కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాతో ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేయడం విశేషంగా మారింది. కథానాయికగా గాయత్రి భరద్వాజ్ నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి యువతను ఆకట్టుకునేలా కథను విశ్వక్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ద్వారా ప్రసిద్ధి చెందిన రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. సంభాషణలను ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ రాస్తున్నారు. సందీప్ కాకర్ల, కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఆంగ్లం, జపనీస్, స్పానిష్ భాషల్లో కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఒకే సినిమాతో నలభై మంది కొత్త ముఖాలను పరిచయం చేయడం ద్వారా విశ్వక్ సేన్ మరో వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టినట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'ది కేరళ స్టోరీ 2'కు సెన్సార్ క్లియరెన్స్..




**వేద న్యూస్ డెస్క్:**

వివాదాల మధ్య తెరకెక్కిన ది కేరళ స్టోరీ 2 చిత్రానికి సెన్సార్ మండలి నుంచి అనుమతి లభించింది. కేంద్ర చిత్ర ప్రమాణాల మండలి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేయడంతో 14 ఏళ్లు పైబడిన వారు తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చని వెల్లడైంది. దీంతో సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. ఇటీవల మనోజ్ బాజ్‌పేయి నటించిన ఘూస్‌ఖోర్ పండత్ చిత్రం శీర్షికపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన నేపథ్యంలో, మరో వివాదాస్పద చిత్రమైన 'ది కేరళ స్టోరీ 2'కు అనుమతి లభించడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, తమ కథలోని అంశాలను సెన్సార్ మండలి విశ్వసించిందని తెలిపారు. బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సినిమా సమాజంలో చర్చకు దారితీసే అంశాలను ప్రస్తావిస్తుందని అన్నారు. మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలను ప్రస్తావిస్తూ తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే రాజకీయ వర్గాల్లో స్పందనలు వచ్చాయి. పినరయి విజయన్ ఈ చిత్రాన్ని విమర్శిస్తూ, ఇది రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. లౌకిక విలువలకు విఘాతం కలిగించే ప్రయత్నమని ఆరోపించారు.

# ఆ తెలుగు హీరోకే లిప్‌లాక్ ఇస్తా..

**వేద న్యూస్ డెస్క్:**



అభిమానులు ముద్దుగా "మిల్కీ బ్యూటీ" అని పిలుచుకునే తమన్నా భాటియా ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా గడుపుతోంది. తెలుగు, తమిళంతో పాటు హిందీ చిత్రాల్లోనూ నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. కథానాయికగా మాత్రమే కాకుండా ప్రత్యేక గీతాల్లోనూ మెప్పిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కొన్ని సందర్భాల్లో ఆమె చేసిన ప్రత్యేక గీతాలే ఎక్కువ ప్రాచుర్యం తెచ్చిపెట్టినట్టు సినీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. తెలుగులో తక్కువ కాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగిన తమన్నా, 'శ్రీ' చిత్రంతో ప్రవేశించి, 'హ్యాపీ డేస్' సినిమాతో మంచి గుర్తింపు పొందింది. ఆ చిత్రం విజయవంతం కావడంతో వరుస అవకాశాలు ఆమెను వరించాయి. ప్రముఖ హీరోల సరసన నటిస్తూ కొన్నేళ్ల పాటు తెలుగు చిత్రసీమలో తనదైన స్థానాన్ని నిలబెట్టుకుంది. అనంతరం హిందీ చిత్రరంగంలోకి అడుగుపెట్టిన తర్వాత తెలుగులో అవకాశాలు కొంత తగ్గినట్టు ప్రచారం జరిగింది. ఇటీవల ఓ సంభాషణ కార్యక్రమంలో ఆమె చేసిన సరదా వ్యాఖ్యలు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ముద్దు సన్నివేశం చేయాల్సి వస్తే ఒక తెలుగు హీరోతోనే చేస్తానని చెప్పినట్లు పాత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచుకుంటున్నారు.

# వాస్తు పిచ్చోడిగా శ్రీ విష్ణు..

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీ విష్ణు మరో వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన నటించిన విష్ణు విన్యాసం చిత్రానికి సంబంధించిన టీజర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రంలో శ్రీ విష్ణు 'చిన్నూ' అనే పాత్రలో కనిపిస్తున్నారు. జాతకాలు, వాస్తుపై అతనికి ఉన్న అతిశయ నమ్మకం కారణంగా చోటుచేసుకునే పరిణామాలు కథకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. చిన్న విషయానికీ వాస్తు కారణం చూపించే అతని స్వభావం చుట్టూ తిరిగే సంఘటనలు నవ్వులు పూయిస్తున్నాయి. దర్శకుడు యదునాథ్ మారుతీ రావు ఈ చిత్రాన్ని ఒంగోలు నేపథ్యంతో తెరకెక్కించారు. అక్కడి ప్రత్యేక యాస, సంభాషణలు టీజర్‌లో ప్రత్యేకంగా నిలిచాయి. శ్రీ విష్ణు తన సహజ హాస్యంతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కథానాయికగా నయన్ సారిక నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతాన్ని రథన్ అందిస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2026న విడుదల కానుంది. ఇదిలా ఉండగా, శ్రీ విష్ణు నటించిన మరో చిత్రం మృత్యుంజయ ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. వరుసగా రెండు రోజుల్లో రెండు చిత్రాలు విడుదల కావడం విశేషంగా మారింది.

# మహిళా క్రికెట్‌లో మహారాణి..
# దిగ్గజాలను దాటేసిన హర్మన్‌ప్రీత్..!






**వేద న్యూస్ డెస్క్:**

వన్డే ప్రపంచకప్ విజయంతో భారత మహిళా క్రికెట్ సుదీర్ఘ కలను సాకారం చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ మరో చారిత్రాత్మక ఘనతను అందుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్‌గా నిలిచి అరుదైన రికార్డు సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో బరిలోకి దిగడంతో ఆమె ఈ మైలురాయిని అందుకుంది. న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ సుజీ బేట్స్ రికార్డును అధిగమిస్తూ 356వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన భారత కెప్టెన్ చరిత్రలో నిలిచింది. ఇప్పటివరకు ఆమె ఆరు టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20 మ్యాచ్‌లు ఆడింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్ల జాబితాలో ఎలీసా పెర్రీ 349, మిథాలీ రాజ్ 333, చార్లొట్టే ఎడ్వర్డ్స్ 309, సోఫీ డెవినె 305 మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హర్మన్‌ప్రీత్, తక్కువ కాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ కీలక ఆటగాడిగా ఎదిగింది. 2012లో తొలిసారి ఆసియా కప్‌లో జట్టుకు నాయకత్వం వహించింది. 2016లో మూడు ఫార్మాట్లకూ సారథిగా ఎంపికైంది. ఆమె నాయకత్వంలో భారత జట్టు 2020లో పొట్టి ప్రపంచకప్ ఫైనల్ చేరి చరిత్ర సృష్టించింది. తాజాగా వన్డే ప్రపంచకప్ గెలిపించి దేశానికి తొలి ప్రధాన అంతర్జాతీయ కప్పును అందించింది. పంజాబ్ రాష్ట్రంలోని మొగా గ్రామంలో 1989 మార్చి 8న జన్మించిన హర్మన్‌ప్రీత్ చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంది. తండ్రి హర్మిందర్ సింగ్ ప్రోత్సాహంతో క్రికెట్‌ను లక్ష్యంగా ఎంచుకుంది. కమల్దీష్ సింగ్ సోధీ శిక్షణలో అబ్బాయిలతో కలిసి సాధన చేస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంది. దూకుడైన ఆటతీరుతో మధ్య క్రమంలో జట్టుకు బలంగా నిలిచింది. దేశీయ స్థాయిలోనూ ఆమె సత్తా చాటింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు నాయకత్వం వహించి రెండు కప్పులు సాధించి పెట్టింది. స్థిరమైన ప్రదర్శన, ధైర్యవంతమైన నాయకత్వంతో మహిళా క్రికెట్‌లో మహారాణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ నిలిచింది.

# వరుస వికెట్లతో వరుణ్ చక్రవర్తి అరుదైన రికార్డ్



**వేద న్యూస్ డెస్క్:**

టీమిండియా స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అంతర్జాతీయ టీ20ల్లో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వరుసగా అత్యధిక మ్యాచ్‌ల్లో వికెట్లు తీసిన తొలి భారత స్పిన్నర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రికార్డును సమం చేశాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో అద్భుత ఫామ్‌లో ఉన్న వరుణ్, ఇప్పటివరకు తొమ్మిది వికెట్లు పడగొట్టి జట్టుకు కీలకంగా మారాడు. బుధవారం అహ్మదాబాద్ వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు సాధించడం ద్వారా ఈ రికార్డును అందుకున్నాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన పోరులో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. తన మిస్టరీ స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన వరుణ్, పవర్‌ప్లే చివరి ఓవర్ నాలుగో బంతికి నెదర్లాండ్స్ ఓపెనర్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వికెట్‌తో అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా 17 మ్యాచ్‌ల్లో కనీసం ఒక వికెట్ తీసిన తొలి భారత స్పిన్నర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇదివరకు అర్ష్‌దీప్ సింగ్ జూన్ 2024 నుంచి డిసెంబర్ 2025 మధ్య వరుసగా 17 మ్యాచ్‌ల్లో కనీసం ఒక వికెట్ సాధించి రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడు వరుణ్ కూడా అదే స్థాయిని అందుకున్నాడు. 2025 నుంచి నెదర్లాండ్స్ మ్యాచ్ వరకు వరుసగా 17 మ్యాచ్‌ల్లో మొత్తం 31 వికెట్లు పడగొట్టి తన స్థిరత్వాన్ని చాటాడు. ఈ జాబితాలో మూడో స్థానంలో టీమిండియా మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా ఉన్నాడు. ఆయన వరుసగా 13 మ్యాచ్‌ల్లో కనీసం ఒక వికెట్ సాధించాడు. వరుణ్ చక్రవర్తి ప్రదర్శనతో టీమిండియా బౌలింగ్ విభాగం మరింత బలపడిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచకప్‌లో దూబే, హార్దిక్ అరుదైన రికార్డులు!

**వేద న్యూస్ డెస్క్:**





టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే అద్భుత ప్రదర్శనతో మెరిశారు. వీరిద్దరి స్ఫూర్తిదాయక ఆటతీరుతో భారత్ భారీ స్కోరు నమోదు చేసి సూపర్-8 దశకు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ పోరులో హార్దిక్ పాండ్యా టీ20 క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. మొత్తం టీ20ల్లో 6000 పరుగులు పూర్తి చేసి, ఇప్పటికే 200కు పైగా వికెట్లు సాధించిన హార్దిక్ ఈ రెండు మైలురాళ్లు అందుకున్న తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 322 టీ20 మ్యాచ్‌లు ఆడిన ఆయన 221 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ రికార్డుతో భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాడు. మరోవైపు శివమ్ దూబే ఈ మ్యాచ్‌లో 66 పరుగులతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఐదో స్థానంలో లేదా ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత బ్యాటర్‌గా దూబే నిలిచాడు. గతంలో హార్దిక్ పాండ్యా 63, యువరాజ్ సింగ్ 58 పరుగులతో ఉన్న రికార్డులను దూబే అధిగమించాడు. ప్రపంచకప్‌లో ఆయనకు ఇదే తొలి అర్ధశతకం కావడం విశేషం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073